క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు



జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

బంట్వారం: కోట్‌పల్లి మండల కేంద్రంలో రోడ్డు పక్కన వెలసిన డబ్బాలతో పాటు ఓ దుకాణం ఎదుట అక్రమంగా వేసిన రేకులషెడ్డును గురువారం అధికారులు తొలగించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఇప్పటికే పలువురికి నోటీసులు జారీ చేశామని అధికారులు తెలిపారు. ఈ విషయంలో సదరు వ్యక్తులు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించకపోవడంతో ఇన్‌చార్జి ఎంపీడీవో డానియల్ పోలీస్ బందోబస్తుతో జేసీబీ సహాయంతో ఆక్రమణలను తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో ధారూరు సీఐ భీమ్‌కుమార్, కోట్‌పల్లి ఎస్ఐ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య

పరిగి: పరిసరాల పరిశుభ్రతే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య పేర్కొన్నారు. స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛా పరిగి కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణ కేంద్రంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రత గురించి ఇంట్లోని తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ప్రతి ఇంట్లో వెలువడే చెత్తను తడి, పొడిగా వేరు చేసి కాలనీలకు వచ్చే చెత్త సేకరణ సిబ్బందికి అందజేయాలన్నారు. చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను మురుగు కాలువల్లో వేయొద్దన్నారు. కాలనీల గుండా ర్యాలీ అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థులచే మానవహారం ఏర్పాటు చేసి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు.

నవాబుపేట రైతుల అరెస్టు

ప్రజాభవన్ ముట్టడికి వెళ్తుండగా ఘటన

నవాబుపేట: రుణమాఫీ కాలేదని ఆగ్రహించిన నారెగూడ గ్రామానికి చెందిన రైతులు గురువారం ప్రజాభవన్ ముట్టడికి వెళ్తుండగా వారిని పోలీసులు అరెస్టు చేసి అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసిన రైతు రుణమాఫీలో సుమారు 300లకు పైగా రైతులు ఉన్నట్లు వారు పేర్కొన్నారు. తమకు ఒక్క రూపాయి కూడా మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకర్లు రైతుల వివరాలను ప్రభుత్వానికి సక్రమంగా ఇవ్వకపోవడంవల్లే తమకు మాఫీ వర్తించలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఈ విషయంలో అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అరెస్టైన వారిలో మైపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, అనంతయ్య, నర్సింలుగౌడ్, పర్మారెడ్డి, క్రిష్టారెడ్డి, వేమారెడ్డి, నర్సింలు, తదితరులు ఉన్నారు.

పీఆర్టీయూ అధ్యక్షుడిగా నవీన్



పెద్దేముల్: ప్రమాణస్వీకారం చేస్తున్న అధ్యక్షుడు నవీన్

పెద్దేముల్: పెద్దేముల్ మండల పీఆర్టీయూ అధ్యక్షుడిగా నవీన్, కార్యదర్శిగా వెంకట్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. గురువారం రాత్రి తాండూరు పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పీఆర్టీయూ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మొత్తం 188 మంది ఉపాధ్యాయుల్లో 154 మంది ఓటింగ్‌లో పాల్గొని ఓటు వేశారు. అధ్యక్షుడిగా నవీన్, కార్యదర్శిగా వెంకట్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులను సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయులు శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్, గౌరవ అధ్యక్షుడు వెంకటరాంరెడ్డి, మాజీ ఎంపీపీ అనురాధ, రాష్ట్ర అసోసియేట్ సభ్యుడు ద్యావరి నరేందర్‌రెడ్డి, అక్కమాదేవి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధర్మప్రథ భజనలు

దోమ: పాలేపల్లి గ్రామస్తులు గురువారం శ్రీశైలం డ్యాంలో వినాయక నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున స్వామిని దర్శించుకొని గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారన్నారు. అనంతరం శ్రీశైల సన్నిధిలో అక్కడి అర్చకుల సహాయంతో ఒక్క రోజు ధర్మప్రథ భజనలు నిర్వహించారు. తిరుపతయ్య, సీనియర్ జర్నలిస్టు నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

‘మహిళాశక్తి’తో ఆర్థిక స్వావలంభన

- పథకానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం
- 473 యూనిట్లను గుర్తించిన అధికారులు
- స్వశక్తి మహిళా సభ్యులకు ఆర్థిక సాయం అందజేత



ఇందిరా మహిళా శక్తి పథకం కింద బట్టల దుకాణం ఏర్పాటు చేసుకున్న కవిత



నందారం గ్రామంలో పిండి గిర్నీ ప్రారంభించిన అధికారులు (ఫైల్)

దౌల్తాబాద్: స్వశక్తి సంఘాల మహిళలు వ్యాపారాల్లో రాణించి ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ‘ఇందిరా మహిళాశక్తి’ పథకానికి శ్రీకారం చుట్టింది. ఔత్సాహిక మహిళలను గుర్తించి బ్యాంకు రుణం అందజేస్తుంది. వారితో వ్యాపారాలు చేయించేలా అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇప్పటికే స్వశక్తి సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, రుణాలను అందిస్తుండగా మహిళాశక్తి పేరుతో మరింత ఆర్థిక సాయం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సబ్సిడీ రుణాలు

ఇందిరా మహిళాశక్తి పథకం కింద మండల సమాఖ్య సంఘం సభ్యులకు బ్యాంకు లింకుతో వ్యాపారాలు చేసుకునేందుకు సబ్సిడీ రుణాలను అందిస్తుంది. దీంతో వారు సబ్సిడీ రుణాలతో గ్రామాల్లో వ్యాపారాలు ప్రారంభించుకోవచ్చు. ముఖ్యంగా పిండిగిర్నీలు, దాల్‌మిల్, కుట్టుమిషన్లు, స్టీల్ సామాన్ల వ్యాపారం, హోటల్స్, జనరల్ స్టోర్స్, బ్యూటీపార్లర్‌లు, బట్టల దుకాణాలు వంటివి నిర్వహించుకోవడానికి వీలుంటుంది. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి స్వయంగా వ్యాపారం చేసి ఆర్థికంగా నిలదొక్కుకునే సువర్ణ అవకాశమని చెప్పొచ్చు.

473 యూనిట్లు గుర్తింపు

మండలంలో ఇందిరా మహిళా శక్తి పథకానికిగాను 473 యూనిట్లు ఏర్పాటునకు ప్రణాళికలు తయారు చేశారు. ఇందులో ఇప్పటికే 100 యూనిట్లు గ్రౌండింగ్ చేసినట్లు ఐకేపీ అధికారులు తెలిపారు. అలాగే కేంద్ర పథకమైన ప్రధానమంత్రి సూక్ష్మ పరిశ్రమ (పీఎంఎఫ్ఎంఈ) కింద కూడా స్వయం సంఘాలకు రుణాలు మంజూరు చేస్తుంది. దీంతో మహిళలు జీవనోపాధి పొంది ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంది. ఇప్పటి వరకూ ఈ పథకం కింద ఒక యూనిట్ గ్రౌండింగ్ చేశారు.

బట్టల దుకాణంతో ఉపాధి

స్వయం సహాయక సంఘంలో సభ్యురాలుగా ఉన్నాను. ఇందిరా మహిళ శక్తి పథకం కింద రూ.2లక్షలు బ్యాంకు రుణం మంజూరైంది. దీంతో బట్టల దుకాణం పెట్టుకొని ఉపాధి పొందుతున్నాను. ఈ పథకం ఆర్థికంగా ఎదగడానికి ఎంతో ఉపయోగపడుతుంది.

– కవిత, దౌల్తాబాద్

సద్వినియోగం చేసుకోవాలి

మహిళా సంఘాలు ఇందిరా మహిళ శక్తి, పీఎంఎఫ్ఎంఈ పథకాల ద్వారా బ్యాంకులు మంజూరు చేసే రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా రాణించాలి. గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా మండల సమాఖ్య సంఘాలకు అనేక రకాల జీవనోపాధిని కల్పిస్తుంది.

– సాయన్న, ఏపీఎం

పనులు పూర్తి కాకుండానే టెండర్లు

- పది నెలలుగా దుకాణాలు అప్పగించని వైనం
- ఇబ్బందుల్లో టెండరుదారులు
- పట్టించుకోని అధికారులు



మెట్లు లేని దుకాణాలు

కొడంగల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గత సంవత్సరం అసంపూర్తిగా నిర్మించిన ఆరు దుకాణాలకు పనులు పూర్తి చేయకుండానే టెండర్లు పిలిచారు. ఈ ఏడాది జనవరిలో టెండర్లు వేస్తే తాము దుకాణాలను టెండర్లో దక్కించుకున్నట్లు చెబుతున్నారు. ఆరు దుకాణాలకు గాను ఒక్కో దుకాణానికి రూ.లక్ష చొప్పున డిపాజిట్ తీసుకున్నారన్నారు. తాము డిపాజిట్ చెల్లించి పది నెలలు గడిచినా ఇప్పటి వరకూ తమకు అప్పగించ లేదని విమర్శించారు. డిపాజిట్‌గా తీసుకున్న లక్ష రూపాయలు తాము అధిక వడ్డీరేటుకు తీసుకొచ్చినట్లు టెండర్లు దక్కించుకున్న దుకాణాదారులు వాపోయారు. దుకాణాలు అప్పగించే విషయంలో పట్టించుకునే అధికారులు కరువయ్యారు. అంతేకాకుండా ఇప్పటికీ దుకాణాల ముందు మెట్లు నిర్మించలేదన్నారు. అసంపూర్తి పనులతో తాము నష్టపోతున్నామన్నారు. ఒక్కో దుకాణం ముందు మెట్లు నిర్మించాల్సి ఉండగా ఆరు దుకాణాలకు కలిపి రెండు చోట్ల మాత్రమే మెట్లు ఏర్పాటు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని దుకాణాల ఎదుట మెట్లు ఏర్పాటు చేయించాలని టెండరుదారులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజా సంఘాల ఆందోళన విరమణ



వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బొంరాస్‌పేట: మూడురోజులుగా మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట దళిత, ప్రజాసంఘాలు చేస్తున్న ఆందోళనను గురువారం విరమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బ్యాంకులో ఖాతాదారులుగా ఉన్న రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. రైతులకు రుణమాఫీ అందడంలో ఇబ్బందులను, షరతులు లేని రుణమాఫీ, రెన్యూవల్, బ్యాంకులో కాలయాపన వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం బ్రాంచ్ మేనేజరు వాసుకు దళిత ప్రజాసంఘాలు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ సూర్యానాయక్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య, ఎమ్మార్పీఎస్ సుభాష్, బీవీఎం, కేఎన్‌పీఎస్ నాయకులు లక్ష్మయ్య, డప్పు వెంకటయ్య, బలరాం, డప్పు వెంకటయ్య పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం

తాండూరు టౌన్: బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం పేర్కొన్నారు. తాండూరు పట్టణంలోని యశోదనగర్‌లో గురువారం జోరుగా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడారు. 28వ వార్డులోని 151బూత్‌లో ఒక గంటలోపే 100 మందికి పైగా సభ్యత్వం తీసుకున్నారన్నారు. బీజేపీ సీనియర్ నేత, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగారం నర్సింహులుకు తొలి సభ్యత్వ నమోదు కార్డును అందజేసినట్లు మల్లేశం చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, కార్యదర్శి భద్రేశ్వర్, బూత్ అధ్యక్షుడు సంగమేశ్వర్, పట్టణ ఉపాధ్యక్షుడు దోమ కృష్ణ, కోశాధికారి ప్రహ్లాద్ జాదవ్, నాయకులు షాబొద్దీన్, మంతటి రాజు తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్‌లో...

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోటబాసుపల్లి గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. దేశంలో 11 కోట్లు సభ్యత్వంతో బీజేపీ పార్టీ ముందుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రభుశంకర్, జిల్లా సభ్యత్వ ప్రముఖ్ బంటారం భద్రేశ్వర్, ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, మల్లికార్జున్ స్వామి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



తాండూరు టౌన్: మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులుకు సభ్యత్వం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రేపటి వరకు అభ్యంతరాలు స్వీకరించాలి

- ఓటరు జాబితా సిద్ధం చేసిన అధికారులు
- 21 వరకు ఫిర్యాదులు స్వీకరిస్తాం: ఎంపీడీవోలు



పెద్దేముల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జర్నప్ప



నవాబుపేట: మాట్లాడుతున్న ఎంపీడీవో అనురాధ



తాండూరు రూరల్: మాట్లాడుతున్న ఎంపీడీవో విశ్వప్రసాద్

పెద్దేముల్: గ్రామ పంచాయతీ వార్డుల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేసినట్లు, ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21వరకు స్వీకరించాలని ఎంపీడీవో జర్నప్ప పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించారు. మండలంలోని 38 గ్రామ పంచాయతీల అసెంబ్లీ పోలింగ్ కేంద్రాల వారీగా ఉపయోగించిన ఓటరు జాబితాను పంచాయతీ–వార్డుల వారీగా విభజన ప్రక్రియను అధికారులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రతన్‌సింగ్, కోటపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేటలో..

నవాబుపేట: గ్రామాల్లో ఓటరు లిస్టులపై అన్ని రాజకీయపార్టీల నాయకుల అభిప్రాయాలను తీసుకున్నట్లు ఎంపీడీవో అనురాధ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికే ఓటరు లిస్టును గ్రామ పంచాయతీల్లో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ అజయ్‌కుమార్, ఎంపీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శించామని ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో విశ్వప్రసాద్ పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

పూడూరులో..

పూడూరు: ముసాయిదా ఓటర్ల జాబితాపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తమకు తెలియజేయాలని పూడూరు ఎంపీడీవో పాండు తెలిపారు. ఓటరు జాబితాపై ఎలాంటి అభ్యంతరం, అపోహలు ఉన్నా తమ దృష్టికి తేవాలని సూచించారు.

దోమలో..

దోమ: ఓటరు ముసాయిదా జాబితాలో అభ్యంతరాలుంటే తమకు తెలియజేయాలని తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో మహేశ్‌బాబు పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఓటరు జాబితాను వార్డుల వారీగా కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేశామన్నారు. ఈ నెల 21వ తేదీ వరకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్న స్వీకరిస్తామన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: ఓటర్ జాబితాలో ఏమైనా పొరపాట్లు ఉంటే పంచాయతీ కార్యదర్శులకు లేదా బూత్‌లెవల్ అధికారులకు చెప్పాలని ఎంపీడీవో రాజ్‌మల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌రింటెండెంట్ కృష్ణరావు, ఈఓపీఆర్‌డీ సుశీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: ప్రతి గ్రామ పంచాయతీల్లో ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శించామని, ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 21లోపు తెలియజేయాలని వికారాబాద్ ఎంపీడీవో వినయ్‌కుమార్ తెలిపారు. ఎంపీఓ దయానంద్, సూపరింటెండెంట్ చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటా

బంట్వారం: రెండు కిడ్నీలు పాడై నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహేశ్వరిని బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. సుమారు రూ.10 లక్షల వరకు వైద్య ఖర్చులు అవుతాయని ఆస్పత్రి వర్గాలు చెప్పడంతో కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడడంతో రూ 3.50లక్షల వరకు తగ్గించారన్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సహాయంతో పాటు ఇతర ఖర్చులకు సహాయం చేస్తానని ఆయన బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు.

గెలుపోటములు సహజం

శంకర్‌పల్లి: ఆటల్లో గెలుపోటములు సహజమని ఎంపీడీఓ వెంకయ్య, మోకిల సీఐ వీరబాబు అన్నారు. మోకిల గ్రామంలో గురువారం చేవెళ్ల జోనల్ స్థాయి అండర్–14, 17 ప్రభుత్వ పాఠశాల బాలబాలికలకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. శంకర్‌పల్లి, చేవెళ్ల, షాబాద్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల జట్లు పోటీపడ్డాయి. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంపీడీఓ, సీఐలు బహుమతులు ప్రదానం చేశారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీడీఓ వెంకయ్య, సీఐ వీరబాబు

అధికారుల తీరుపై మండిపాటు

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను గురువారం అధికారులు దరఖాస్తుదారుల నుంచి స్వీకరించారు. అయితే వారిని ఎండలో నిలబెట్టి తీసుకోవడంతో మండిపడుతున్నారు. కార్యాలయంలో సరిపడ గదులున్నా ఆరుబయట ఎండలో నిలబెట్టి దరఖాస్తులు తీసుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కార్యాలయంలో డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ ఉన్నా దరఖాస్తుదారుల కష్టాలు పట్టించుకోకపోవడంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ ఇసుక తరలింపునకు అనుమతులు

యాలాల: మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్ సమీపంలోని కాకరవేణి నది నుంచి పెద్దేముల్ మండలానికి వంద క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలించేందుకు అనుమతులు ఇచ్చినట్లు యాలాల తహసీల్దార్ అంజయ్య తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తాము ఇసుక తరలింపునకు అనుమతులు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

◆ గ్యాస్ సబ్సిడీ పత్రాల పంపిణీ

దౌల్తాబాద్: ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద మంజూరైన గ్యాస్ సబ్సిడీ (రూ.500లకే సిలిండర్) పత్రాలను లబ్ధిదారులకు గురువారం దేవర్‌ఫసల్‌వాద్ గ్రామంలో పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి మంజూరు పత్రాలను స్థానిక ప్రజాప్రతినిధులు అందజేశారు.

◆ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

కుల్కచర్ల: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జ్యోతిహెప్సిబా పేర్కొన్నారు. కులకచర్ల మండలం ముజాహిద్‌పూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో బుధవారం నిర్వహించిన జోనల్ స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీఈటీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ సమస్యలు పరిష్కరించాలని వినతి

అనంతగిరి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆరోగ్యశ్రీ సిబ్బంది సమ్మెలోకి వె వెళ్తున్నామని తెలిపారు. గురువారం వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 60 ప్రకారం కనీస వేతనాలు రూ.22,750 చెల్లించాలన్నారు. జీతాలను ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా ట్రస్టు నుంచి చెల్లించాలన్నారు. 16 సంవత్సరాల నుంచి పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలను తిరిగి పీహెచ్‌సీలో నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు బాల్‌రాజు, భూపాల్, గిరి యాదయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ బీఆర్ఎస్ నాయకుల బైండోవర్

కుల్కచర్ల: ప్రతీ రైతుకు రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని, బీఆర్ఎస్ ఇచ్చిన ప్రజాభవన్ ముట్టడి సందర్భంగా పోలీసులు వారిని ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలో పలువురు బీఆర్ఎస్ నాయకులకు ముందస్తుగా అరెస్టుచేసి వ్యక్తిగత పూచికత్తుతో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బిచ్చయ్య, యాదయ్య, మొగులయ్య పాల్గొన్నారు.

◆ కనీస సామర్థ్యాలను నేర్పించాలి

దోమ: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి కనీస సామర్థ్యాలను నేర్పించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల నోడల్ అధికారి వెంకట్ సూచించారు. గురువారం దోమ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలతో పాటు బాలిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతీ ఉపాధ్యాయుడు విద్యార్థుల పట్ల స్నేహభావంగా ఉంటూ బోధన చేయాలన్నారు. ఇంగ్లిష్‌లో మాట్లాడడం, చదవడం వంటివి ప్రధానంగా నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అంజనేయులు గౌడ్, మండల సీఆర్‌పీలు పాల్గొన్నారు.

◆ పీసీసీ చీఫ్‌కు సన్మానం

షాద్‌నగర్‌రూరల్: పీసీసీ చీఫ్‌గా నియమితులైన మహేశ్‌కుమార్‌నుగౌడ్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకులు ఎమ్మెల్యేతో కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బీసీల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందనిన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో మధుసూదన్‌రెడ్డి

షాబాద్: కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే తప్పదని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో మధుసూదన్‌రెడ్డి, సీనియర్ నాయకులు చేవెళ్ల స్వామి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నర్సింహారావు, కందివనం రామస్వామిగౌడ్, వడ్ల రాఘవచారి, బోనాల వెంటకయ్య, పంతులు రాంచందర్‌రావు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్రంలో నియంతపాలన పోయి బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వం వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నర్సింలు, వెంకటయ్య, చంద్రయ్య, నారాయణ, నర్సింగ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి



ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతుకోసం తరలిస్తున్న శ్రీనివాస్ రెడ్డి

కుల్కచర్ల: గ్రామస్తులకు విద్యుత్ సమస్య తలెత్తకుండా పరిష్కరిస్తానని అనంతసాగర్ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండలం అనంతసాగర్ గ్రామంలో విద్యుత్ సమస్య తలెత్తి గ్రామ పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్ బుడ్డీలు పాడవడంతో వాటిని ప్రవేటు వాహనంలో తీసుకెళ్లి మరమ్మతులు చేయించామన్నారు. గ్రామస్తులకు ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

తాండూరు రూరల్: జినుగుర్తి గ్రామంలో మిలాద్ ఉన్ నబీ భక్తిశ్రద్ధలతో గురువారం జరుపుకున్నారు. ముస్లిం సోదరులు గ్రామంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చందు మాట్లాడారు. కుల మతాలకు అతీతంగా గ్రామంలో ప్రజలు కలిసి మెలిసి ఉండాలన్నారు. ప్రతీ ముస్లిం మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గం అనుసరించాలన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజ్మత్, మాజీ ఉప సర్పంచ్ హసీం అలీ, రఘుకిషోర్, శ్రీనివాస్‌గౌడ్, పాల్గొన్నారు.



ర్యాలీలో ముస్లిం సోదరులు